సాక్షి
జగిత్యాల

ఆదివారం । 27 । అక్టోబర్ । 2024

కుక్కల బెడద తప్పేనా?

- కొనసా..గుతున్న కు.ని. ఆపరేషన్లు
- ఇప్పటివరకు వెయ్యి శునకాలకు స్టెరిలైజేషన్





కుక్కకు కు.ని. ఆపరేషన్ చేస్తున్న వైద్యులు

జగిత్యాల: జిల్లా వ్యాప్తంగా కుక్కల బెడద తీవ్రతరం కావడంతో పాటు, చిన్నారులు, మహిళలు, వృద్ధులను వెంటాడి కరుస్తుండటంతో మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో అత్యధిక ఫిర్యాదులు వచ్చాయి. కుక్కల బెడద నుంచి తప్పించాలని హైకోర్టు సైతం తీర్పు ఇవ్వడంతో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రతీ మున్సిపల్‌లో ఎనిమల్ కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేసి స్టెరిలైజేషన్ చేపట్టాలని ఆదేశించింది. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి మున్సిపాలిటీలున్నాయి.

ఎనిమల్ కేర్ సెంటర్‌లో కు.ని.

ముందుగా జగిత్యాలలోని నూకపల్లి డంపింగ్ యార్డు వద్ద ఎనిమల్ కేర్ సెంటర్ ఏర్పాటు చేశారు. అందులో కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ఏర్పాటు చేసేందుకు 36 కన్నెల్స్‌ను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం హైదరాబాద్‌కు చెందిన ఏజెన్సీకి లీజుకు ఇవ్వగా ఒక కుక్కకు రూ.1,425 చెల్లించేలా ఒప్పందం జరిగింది. కానీ ఈప్రక్రియ నెమ్మదిగా జరగడంతో కుక్కల బెడద ఇప్పట్లో తప్పేలా లేదు. ఆగస్టు 9న దీనిని ప్రారంభించగా ఇప్పటి వరకు వెయ్యి కుక్కలకు మాత్రమే కు.ని ఆపరేషన్లు జరిగాయి. ఇటీవలే డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి ఎనిమల్ కేర్ సెంటర్‌ను పరిశీలించారు. కాగా, జగిత్యాలలో ఏర్పాటు చేసిన సెంటర్‌లో కన్నెల్స్ తక్కువగా ఉండటంతో కుక్కలకు ఆపరేషన్లు చేసేందుకు ఇబ్బందికరంగా మారింది. మొత్తం రెండు ఫ్లోర్లలో 36 కన్నెల్స్ ఏర్పాటు చేశారు. కింద 18, పైన 18 కన్నెల్స్ ఉండటంతో మీద వాటిలో ఆపరేషన్ చేసిన అనంతరం కింది వాటిలో వాటిని ఐదు రోజుల పాటు అబ్జర్వేషన్‌లో ఉంచుతారు. ఆ తర్వాతే మళ్లీ కుక్కలను పట్టుకురావాల్సి ఉంటుంది. ఈనేపథ్యంలో ఒకరోజు 18 కుక్కలకు మాత్రమే కు.ని చేయాల్సి వస్తుంది. మరిన్ని కన్నెల్స్ ఏర్పాటు చేస్తే తొందరగా కుక్కల బెడద తప్పే అవకాశం ఉంటుంది. కాగా కోరుట్ల, మెట్‌పల్లిలో ఇప్పటి వరకు ఎనిమల్ కేర్ సెంటర్ ఏర్పాటు చేయలేదు. అక్కడి కుక్కలను తీసుకువచ్చి జగిత్యాల సెంటర్‌లో కు.ని. చేస్తున్నారు. ఇప్పటికే కోరుట్ల నుంచి 15, మెట్‌పల్లి నుంచి 15 కుక్కలను తెచ్చి చేశారు. ధర్మపురి, రాయికల్‌లో ఊసేలేదు. అక్కడి అధికారులు అత్యధిక సంఖ్యలో కుక్కలు లేవని పేర్కొంటున్నప్పటికీ ఆ ప్రాంతాల్లోనే కుక్కలు అధికంగా ఉన్నట్లు సమాచారం.

వీధికుక్కల గణన చేపట్టారా?

వీధికుక్కలు ఎన్ని ఉన్నాయి, వాటి నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి, టీకా ఇవ్వడంతోపాటు, చికిత్సకు ఎంత వ్యయం అవుతుందన్న వివరాలు మొదట సేకరించాలని ప్రభుత్వం ఆదేశించినా ఎక్కడా అది కానరానట్లు తెలుస్తోంది. జిల్లావ్యాప్తంగా దాదాపు 15 వేల వీధి కుక్కలు ఉన్నట్లు అంచనా. కుక్కలకు స్టెరిలైజేషన్‌కు చర్యలు తీసుకుంటున్నా వాటి బెడద తప్పడం లేదు. జిల్లా కేంద్రంలోని ప్రతీ వీధిలో గుంపులుగా సంచరిస్తున్నాయి. చిన్నారులైతే బయటకువెళ్లలేని పరిస్థితి నెలకొంది.

ఎక్కడి కుక్కలు అక్కడికే..

ఎనిమల్ కేర్ సెంటర్‌లో కుక్కలకు కు.ని ఆపరేషన్లు చేసిన అనంతరం వాటిని ఎక్కడి నుంచి తీసుకువచ్చారో అక్కడికే తరలిస్తారు. కుక్కలకు స్టెరిలైజేషన్ చేయడం వల్ల వాటి పునరుత్పత్తి నిలిచిపోతుంది. దీంతో కుక్కల బాధ తప్పే అవకాశాలుంటాయి.

ఆపరేషన్లు జరుగుతున్నాయి



కుక్కలకు కు.ని. ఆపరేషన్ల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది. కన్నెల్స్ తక్కువగా ఉండటం వల్ల ఆలస్యం అవుతుంది. మళ్లీ పెంచేలా చర్యలు తీసుకుంటాం. కోరుట్ల, మెట్‌పల్లిలో సైతం ఏర్పాటు చేస్తున్నారు. జగిత్యాలలో దాదాపు 5 వేలు ఉంటాయని అంచనా. త్వరలోనే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

– చిరంజీవి, మున్సిపల్ కమిషనర్, జగిత్యాల

న్యూస్‌రీల్

కార్యకర్తలకు అండగా కాంగ్రెస్



నాయకులు, కార్యకర్తలతో మధుయాష్కి

జగిత్యాలటౌన్: కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్ భరోసా ఇచ్చారు. ఇటీవల హత్యకు గురైన గంగారెడ్డి కుటుంబాన్ని పరామర్శించేందుకు శనివారం జాబితాపూర్ వెళ్లే క్రమంలో జగిత్యాలలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. జగిత్యాల రాజకీయ పరిణామాలపై పలువురు ఆయనకు వివరించగా అదిష్టానం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాలక్రైం: పోలీస్ సిబ్బంది, అధికారులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. శనివారం కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ వారి సహకారంతో జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు నడక, వ్యాయామం వంటివి దినచర్యలో భాగం చేసుకోవాలన్నారు. శిబిరంలో 300 మంది పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు చేశారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. మొదటి బహుమతి జగిత్యాల రూరల్, ద్వితీయ బహుమతి మెట్‌పల్లి, తృతీయ బహుమతి కోరుట్ల జట్లు గెలుచుకున్నాయి. కార్యక్రమాల్లో ఏఎస్పీ భీమ్‌రావ్, డీఎస్పీలు రవీంద్రకుమార్, రఘుచందర్, ఉమామహేశ్వరరావు, వైద్యులు నాగరాజు, వేణుగోపాల్, దిలీప్‌రెడ్డి, ప్రతిష్టారావు, అనీష్, తాహా, హర్షిత్, ఆర్‌ఐలు కిరణ్‌కుమార్, రామకృష్ణ, వేణు, ఐటీ కోర్, డీసీఆర్బీ సీఐలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం

జగిత్యాలరూరల్: జిల్లాలో వానాకాలం వరిధాన్యం కొనుగోళ్లకు సర్వం సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా 424 కేంద్రాలు.. ఐకేపీ ఆధ్వర్యంలో 136, డీసీఎంఎస్ 287, మెప్మా ఆధ్వర్యంలో ఒక కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అలాగే 4.78 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డురకం, 94 వేల మెట్రిక్ టన్నుల సన్నం రకం ధాన్యం దిగుబడి వస్తుందని అంచనాలు వేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించామని అదనపు కలెక్టర్ రాంబాబు పేర్కొన్నారు.

పనులు చేయనివారికి నోటీసులివ్వండి

- విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్



సమీక్ష సమావేశంలో విప్ లక్ష్మణ్‌కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్, అధికారులు

ధర్మపురి: అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని, చేయని వారికి నోటీసులు జారీ చేయాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. ధర్మపురి పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం కోట్లాది రూపాయలతో చేపడుతున్న పనుల ప్రగతిపై శనివారం ఆలయ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముందుగా బస్టాండ్ వద్ద 60 గదుల ధర్మశాల గదులు, ఎస్‌కేఎస్‌ఆర్ షాపింగ్ కాంప్లెక్స్, పుట్ట బంగారం, నాగమయ్య ఆలయం తదితర నిర్మాణ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా విప్ మాట్లాడుతూ, ఆలయ పరిధిలో మహా అన్నదాన భవనం నిర్మించేందుకు దాతలు ముందుకు వస్తున్నారని, రోజూ 500 మందికి భోజన వసతి కల్పించాలన్నారు. వివిధ అభివృద్ధి పనులకు అంచనాలు తయారు చేసి నివేదిక ఇస్తే సీఎంతో మాట్లాడి నిధుల మంజూరుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. గోదావరి తీరంలో భక్తులు సేద తీరేందుకు డార్మిటరి హాల్స్, బట్టలు మార్చుకునేందుకు గదులు, మరుగుదొడ్లు, షవర్స్ ఏర్పాటు చేసేందుకు సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం విప్, కలెక్టర్ వేర్వేరుగా శ్రీలక్ష్మీ నృసింహస్వామివారలను దర్శించుకున్నారు. ముందుగా వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకగా, దర్శనం అనంతరం స్వామివారి శేష వస్త్రం, ప్రసాదం అందజేశారు. మెట్‌పెల్లి ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ కృష్ణ చైతన్య, ఆలయ ఈవో శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రతాప్, సీనియర్ అసిస్టెంట్ అలువాలు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇరవై ఏళ్ల కల సాకారమైంది

వెల్గటూర్(ధర్మపురి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు భూ నిర్వాసితుల 20 ఏళ్ల కల నేటితో సాకారమైందని ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి చెగ్యాం గ్రామ భూనిర్వాసితులు 126 కుటుంబాలకు రూ.18 కోట్ల విలువగల పరిహారం చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ, పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు భూనిర్వాసితులను పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీ. దర్‌బాబు చొరవతో పరిహారం విడుదల చేయిస్తే దానిపై కూడా ప్రతిపక్షాలు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుండాటి గోపిక, వైస్ చైర్మన్ గోళ్ల తిరుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, రంగు తిరుపతి, మేరుగు మురళి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ ఆగ్రహం!

- 1998లో తొలిసారి కరీంనగర్‌లో నిరసన
- ప్రస్తుతం సిరిసిల్ల బెటాలియన్‌లో ధర్నా
- 26 ఏళ్ల తర్వాత ఉమ్మడి జిల్లాలో ఆందోళన పునరావృతం

సాక్షిప్రతినిధి, కరీంనగర్:



ఉమేశ్ చంద్ర (ఫైల్)

కరీంనగర్ జిల్లా పోలీసుల్లో మరోసారి ఆగ్రహం రగిలింది. 1998లో అప్పటి ఎస్పీ చదలవాడ ఉమేశ్‌చంద్ర బదిలీని వ్యతిరేకిస్తూ పోలీసులు నిరసనకు దిగడం కలకలం రేపగా.. ప్రస్తుతం సిరిసిల్ల బె టాలియన్‌లో టీజీఎస్పీ పోలీసులు ఏక్ పోలీసింగ్ వ్యవస్థ కోసం ఉద్యమించడం సంచలనం సృష్టించింది. దాదాపు 26 ఏళ్ల తర్వాత తిరిగి అదే స న్నివేశం పునరావృతం కావడం చర్చనీయాంశంగా మారింది. ఆనాడు పోలీసుల్లో అకస్మాత్తుగా చెలరేగిన ఆగ్రహజ్వాలల గురించి సీనియర్లు, పదవీ విరమణ చేసిన వారు శనివారం నెమరు వేసుకున్నారు.

నాడు ఏం జరిగింది?

1998 ఏప్రిల్ 19న అప్పటి కరీంనగర్ ఎస్పీ చదలవాడ ఉమేశ్‌చంద్రను ప్రభుత్వం ఆకస్మికంగా బదిలీ చేసింది. బదిలీపై వచ్చిన కొన్ని నెలల్లోనే సిబ్బంది మనసు గెలిచిన ఆయన.. తిరుగులేని పోలీసుగా ప్రజల మనసుల్లోనూ చెరగని ముద్ర వేసుకున్నారు. జగనజాగృతి కార్యక్రమాలు..వరుస ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లు, కోవర్టు ఆపరేషన్లతో అప్పటి పీపుల్స్‌వార్ నడ్డి విరిచినంత పనిచేశారు. మరోవైపు.. ప్రజల రక్తాన్ని వడ్డీ రూపంలో పీల్చుతున్న ఫైనాన్స్, వడ్డీ వ్యాపారుల ఆగడాలకు ముకుతాడు వేశారు. ఇది మింగుడుపడని రాజకీయ నేతలు కొందరు ఆయనను బదిలీ చేయించారన్న కోపంతో పోలీసులు జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో నిరసనకు దిగారు. దాదాపు రెండుమూడ్రోజులు కరీంనగర్‌లో కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. దీంతో అప్పటి ప్రభుత్వం కొందరు పోలీసు అధికారులపై చర్యలు తీసుకుంది. తదనంతరం ఉమేశ్‌చంద్ర హైదరాబాద్‌లో విధినిర్వహణలో ఉండగా ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికీ ఆయన ఫొటో కరీంనగర్‌లో రిటైర్డ్, సీనియర్ పోలీసుల ఇంటి గోడలపై ఉంటుంది. చాలామంది పోలీసులు తమ పిల్లలకు ఆయన పేరు కలిసి వచ్చేలా చంద్ర అని పెట్టుకోవడం పోలీసులు ఆయనపై పెంచుకున్న గౌరవాన్ని చాటిచెబుతుంది.

సిరిసిల్ల కమాండెంట్ చాంబర్ ముట్టడి..

బెటాలియన్‌లో వివిధ హోదాల్లో పనిచేసే పోలీసులకు రికార్డు పర్మిషన్ విషయంలో సిరిసిల్లలోని 17వ బెటాలియన్‌లో శనివారం చేపట్టిన అభిప్రాయాల సేకరణ ప్రక్రియ ఉద్రిక్తతకు దారితీసింది. బెటాలియన్‌లో ఉదయం 10 గంటలకు అభిప్రాయాలను తెలియజేసేందుకు ఉద్యోగులు దర్బార్‌కు చేరుకున్నారు. ఆ సమయానికి కమాండెంట్ శ్రీనివాసరావు దర్బార్‌కు రాలేదు. కోపోద్రిక్తులైన ఉద్యోగులు ఒక్కసారిగా కమాండెంట్ చాంబర్ చుట్టుముట్టారు. సమాచారం అందుకున్న ఎస్పీ అఖిల్ మహాజన్ ఘటన స్థలానికి చేరుకొని ఉద్యోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా బెటాలియన్ సిబ్బంది 'ఏక్ పోలీస్ విధానం అమలు చేయాలని, తమతో వెట్టిచాకిరీ పనులు చేయిస్తున్నారు' అని ఎస్పీకి మొరపెట్టుకున్నారు. కొందరు ఎస్పీ అఖిల్ మహాజన్ కాళ్ల మీదపడి విలపించడం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.



ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్స్ ఉద్యోగాలు సాధించడం వారి కల.. ఒక్కొక్కరిది ఒక్కో కుటుంబ నేపథ్యం.. వ్యవసాయ, గీత, దర్జీ, మున్సిపల్ కార్మిక, వ్యాపార, వైద్య, ఉపాధ్యాయ, రాజకీయ కుటుంబాలకు చెందినవారు తమ లక్ష్యాన్ని చేరుకునేందుకు నిరంతరం కష్టపడ్డారు.. అనుకున్నది సాధించారు.. నేడు మన రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల్లో ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. కలెక్టర్లుగా, అడిషనల్ కలెక్టర్లుగా, పోలీస్ కమిషనర్, ఎస్పీ, ఏఎస్పీ, డీసీపీలుగా, ఇతర ఉద్యోగాల్లో నిబద్ధతతో పని చేస్తూ ప్రజల సంక్షేమం, రక్షణకు కృషి చేస్తున్నారు.. పలువురు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.. స్వస్థలాలను వదిలి, ఎక్కడెక్కడో పని చేస్తున్న ఉమ్మడి జిల్లావాసులను చూసి, ఇక్కడి వారు గర్విస్తున్నారు.. ఆ అధికారులపై ప్రత్యేక కథనం.

మనోళ్లు.. ఐఏఎస్ ఐపీఎస్‌లు

సండే స్పెషల్

- కష్టపడ్డారు.. నిర్దేశిత లక్ష్యం సాధించారు
- కొందరికి పదోన్నతి ద్వారా హోదా
- ఉమ్మడి జిల్లా నుంచి ఉన్నత ఉద్యోగాల్లో పలువురు
- రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల్లో విధులు
- పలు సేవా కార్యక్రమాల నిర్వహణ
- యువతకు ఆదర్శంగా నిలుస్తున్న అధికారులు

నరహరి.. మధ్యప్రదేశ్‌లో ప్రిన్సిపల్ సెక్రటరీ



నరహరి

పాలకుర్తి(రామగుండం): పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్‌కు చెందిన దర్జీ పరికిపండ్ల సత్యనారాయణ–సరోజ దంపతుల కుమారుడు నరహరి. ఇంజినీరింగ్ చదివారు. 2001లో ఐఏఎస్‌గా మధ్యప్రదేశ్ కేడర్‌కు ఎంపికయ్యారు. ఇండోర్, గ్వాలియర్ జిల్లాల కలెక్టర్‌గా, ఆ రాష్ట ఐఅండ్‌పీఆర్ కమిషనర్‌గా పని చేశారు. ప్రస్తుతం గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీగా(జల్ జీవన్ మిషన్)లో పని చేస్తున్నారు. పుట్టిన ఊరు బసంత్‌నగర్‌పై మమకారంతో తన తండ్రి స్మారకార్థం శంకర విజన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తున్నారు. కూతురు ఆలయ పేరిట ఆలయ ఫౌండేషన్ ఏర్పాటు చేసి, విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో సేవలందిస్తున్నారు. యువతకు శిక్షణ, జాబ్‌మేళాలు, తలసేమియా బాధిత చిన్నారుల కోసం రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌లోని స్వర్ణభారతి ట్రస్ట్ సహకారంతో దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు, చేతులు అమరుస్తున్నారు. యువత లక్ష్యాన్ని ఎంచుకొని, కష్టాన్ని నమ్ముకొని ముందుకు సాగాలని సూచిస్తున్నారు.

అంజిత.. ఢిల్లీలో డీసీపీ



అంజిత

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీకి చెందిన చెప్యాల సత్యనారాయణ–మంగ దంపతుల కుమార్తె అంజిత బీటెక్ చదివారు. వీరిది వ్యవసాయ కుటుంబం. ఘట్‌కేసర్‌లో ఉద్యోగం చేస్తున్న సమయంలో సివిల్స్ టాపర్‌గా నిలిచిన ఓ మహిళను ఆదర్శంగా తీసుకున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో 2008లో ఐపీఎస్ సాధించారు.ఢిల్లీలోని ఉత్తర జిల్లా డీసీపీగా(ఎర్రకోట, చాందినీ చౌక్, సదర్ బజార్ వంటి ప్రసిద్ధ మార్కెట్లు ఉన్న ఏరియా) విధులు నిర్వహిస్తున్నారు. ఆమె భర్త సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. నేడు ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, అందరూ ఉన్నత విద్యనభ్యసించాలని సూచించారు. నిరంతర శ్రమ, పుస్తక విజ్ఞానం,ఏకాగ్రత, క్రమశిక్షణ ఉంటే విజయం చేరువవుతుందని తెలిపారు.

శివమారుతిరెడ్డి.. ఏఎస్పీగా శిక్షణ



శివమారుతిరెడ్డి

కోరుట్ల: అయిలాపూర్‌కు చెందిన ఏనుగు శివమారుతి రెడ్డి ఏడాది క్రితం సివిల్స్‌లో 132వ ర్యాంకు సాధించాడు. ఒడిశా కేడర్ ఐపీఎస్‌గా ఎంపికై, భువనేశ్వర్‌లో ఏఎస్పీ శిక్షణలో ఉన్నారు. ఆయన తల్లిదండ్రులు అంజిరెడ్డి–పుష్పలత. అంజిరెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ తనకు ఇష్టమైన వ్యవసాయం కొనసాగిస్తున్నారు. ట్రెయినింగ్‌లో శారీరక, మానసిక దృఢత్వంతోపాటు ఎన్నో అంశాలపై అవగాహన పెంచుకుంటున్నానని తెలిపారు. విధుల్లో చేరాక పేదలకు, నిస్సహాయులకు చట్ట ప్రకారం న్యాయం జరిగేలా చూస్తానని పేర్కొన్నారు.

శ్రీధర్.. క్రీడాశాఖ ముఖ్య కార్యదర్శి



శ్రీధర్

మెట్‌పల్లి(కోరుట్ల): మెట్‌పల్లి పట్టణానికి చెందిన నడిమెట్ల శ్రీధర్ వ్యాపార కుటుంబం నుంచి వచ్చారు. ఆయన 1997 ఐఏఎస్ బ్యాచ్ చెందిన అధికారి. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత మొదట రాజమండ్రి సబ్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. అనంతరం ఆదిలాబాద్ జిల్లా ఊట్నూర్ ఐటీడీఏ పీవోగా, కాకినాడ పోర్ట్ డైరెక్టర్‌గా సేవలందించారు. అ తర్వాత అనంతపూర్, కృష్ణ, వరంగల్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్‌గా పని చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో చివరి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో సీఎంవో కార్యాలయ కార్యదర్శిగా ఉన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత 2015 జనవరి 1న సింగరేణి సీఎండీగా బాధ్యతలు చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గత జనవరిలో ఎస్సీ అభివృద్ధి, యువజన, పర్యాటక, సాంస్కృతిక, క్రీడల శాఖల ముఖ్య కార్యదర్శిగా నియమించింది.

సుభాష్.. హెచ్‌ఎండీఏ జేడీ



సుభాష్

కోనరావుపేట: మండలంలోని కనగర్తికి చెందిన డాక్టర్ యెల్లె రాజయ్య కుమారుడు సుభాష్ హైదరాబాద్‌లో హెచ్‌ఎండీఏ జాయింట్ డైరెక్టర్‌గా కొనసాగుతన్నారు. కోరుట్ల మున్సిపల్‌లో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి పదోన్నతులు పొందుతూ ఈ స్థాయికి చేరుకున్నారు. సుభాష్ తండ్రి రాజయ్య సిరిసిల్లలో తొలితరం వైద్యుడిగా గుర్తింపు పొందారు.

శరత్‌నాయక్.. త్రిపురలో అదనపు కలెక్టర్



శరత్‌నాయక్

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలం చెర్లపల్లిలో పేద కుటుంబంలో పుట్టారు శరత్‌నాయక్. 2021లో సివిల్స్‌కు ఎంపికయ్యారు. తల్లి యమున అంగన్‌వాడీ టీచర్‌గా, తండ్రి బాషానాయక్ వ్యవసాయం చేస్తున్నారు. శరత్‌నాయక్ ప్రస్తుత త్రిపురలోని కమలాపూర్ జిల్లాలో అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తున్నారు.

అశోక్‌రెడ్డి.. వాటర్ బోర్డు ఎండీ



కుటుంబసభ్యులతో అశోక్‌రెడ్డి

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని కొత్తగట్టుకు చెందిన కోరెం శ్రీనివాస్‌రెడ్డి–ప్రమీల దంపతుల చిన్న కుమారుడు అశోక్‌రెడ్డి గ్రూప్–1 సాధించారు. పదోన్నతుల ద్వారా 2023లో ఐఏఎస్‌గా హోదా పొందారు. ప్రస్తుతం హైదరాబాద్ వాటర్ బోర్డు ఎండీగా పని చేస్తున్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదివిన తాను టీచర్‌గా పని చేసిన సోదరుడు వాసుదేవరెడ్డి ప్రోత్సాహంతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యానని తెలిపారు.

శ్రీకాంత్‌రెడ్డి.. సచివాలయ ఆడిట్ ఆఫీసర్



శ్రీకాంత్‌రెడ్డి

శంకరపట్నం: మెట్‌పల్లికి చెందిన సారబుడ్ల శ్రీకాంత్‌రెడ్డి తొలుత ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, 2012లో గ్రూప్–2, 2017లో గ్రూప్–1 ఉద్యోగాలు సాధించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆడిట్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. ఉపాధ్యాయ వృత్తే తాను ఈ స్థాయిలో ఉండటానికి కారణమని అన్నారు.

కుమార్.. మహారాష్ట్రలో ఎస్పీ



కుమార్

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పోతిరెడ్డిపేటకు చెందిన చింత రాములు–శ్యామల దంపతుల పెద్ద కుమారుడు కుమార్ సివిల్స్ రాసి, ఐపీఎస్‌గా ఎంపికయ్యారు. రాములు గీత కార్మికుడు. కుమార్‌కు సోదరుడు, సోదరి ఉన్నారు. బీటెక్ పూర్తయ్యాక ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యానని తెలిపారు. రాష్ట్రానికి సంబంధించి 10కి పైగా ఉద్యోగాలు సాధించానని, సివిల్స్ సాధించడమే లక్ష్యంగా సన్నద్ధమయ్యానని, 2015లో ఐఆర్‌ఎస్ సాధించానన్నారు. 2016లో ఐపీఎస్‌కు ఎంపికయ్యాయని, మహారాష్ట్రలోని యవాత్మల్ ఎస్పీగా పని చేస్తున్నట్లు ఈ సందర్భంగా వివరించారు.

వినయ్‌కృష్ణారెడ్డి.. హెల్త్ జాయింట్ సెక్రటరీ



కుటుంబసభ్యులతో వినయ్‌కృష్ణారెడ్డి

రాయికల్(జగిత్యాల): రాయికల్ మండలంలోని మైతాపూర్‌కు చెందిన వినయ్‌కృష్ణారెడ్డి ప్రస్తుతం హెల్త్ జాయింట్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన దయాకర్‌రెడ్డి–లక్ష్మి దంపతుల మొదటి కుమారుడు. ఉస్మానియా యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చదివి, సివిల్స్‌కు ప్రిపేరవగా, 2008లో స్టేట్ 2వ ర్యాంక్ సాధించారు. ఆదిలాబాద్ ఆర్డీవోగా, వరంగల్ డ్వామా పీడీగా, ఖమ్మం జేసీగా, జనగామ, సూర్యాపేట, నల్గొండ, యాదాద్రి జిల్లాల్లో కలెక్టర్‌గా పని చేశారు.

అనుదీప్.. హైదరాబాద్ కలెక్టర్



అనుదీప్

మెట్‌పల్లి(కోరుట్ల): నాలుగు సార్లు సివిల్స్ పరీక్షల్లో విఫలమైనా ఐదోసారి 2018లో ఐఏఎస్‌గా ఎంపికయ్యారు మెట్‌పల్లికి చెందిన దురిశెట్టి అనుదీప్. ఏకంగా ఆలిండియా మొదటి ర్యాంకు సాధించి, అందరి దృష్టిని ఆకర్షించారు. శిక్షణ అనంతరం భద్రాది కొత్తగూడెం ట్రెనీ కలెక్టర్‌గా, అడిషనల్ కలెక్టర్‌గా పని చేశారు. 2021లో అదే జిల్లాకు కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో రెండుసార్లు కేంద్ర ప్రభుత్వ అవార్డుకు కృషి చేశారు. 2023 జూన్‌లో హైదరాబాద్ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ప్రస్తుతం అక్కడే పని చేస్తున్నారు. ఇప్పటివరకు ఈ జిల్లా కలెక్టర్‌గా పని చేసినవారిలో అనుదీపే అత్యంత పిన్న వయస్కుడు కావడం గమనార్హం.

సుధీర్‌బాబు.. రాచకొండ సీపీ



సుధీర్‌బాబు

సిరిసిల్ల: తంగళ్లపల్లికి చెందిన గొట్టె సుధీర్‌బాబు రాచకొండ పోలీస్ కమిషనర్‌గా పని చేస్తున్నారు. ఈయన భూపతి–శాంత దంపతుల పెద్ద కుమారుడు. భూపతి నేరెళ్ల ఎమ్మెల్యేగా, పెద్దపల్లి ఎంపీగా పని చేశారు. సుధీర్‌బాబు ఢిల్లీలోని జేఎన్‌యూలో ఎంఏ చదివారు. ఎంఫిల్ పూర్తి చేసి, పీహెచ్‌డీ చేస్తూ 1991లో గ్రూపు–1 రాసి డీఎస్పీగా ఎంపికయ్యారు. నల్లగొండ జిల్లా భువనగిరిలో తొలి పోస్టింగ్ పొందారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పని చేశారు. పదోన్నతుల ద్వారా ఐపీఎస్ హోదా పొంది, మహబూబ్‌నగర్ ఎస్పీగా, హైదరాబాద్ వెస్ట్ జోన్, నార్త్ జోన్ డీసీపీగా, వరంగల్ సీపీ పని చేశారు. ప్రస్తుతం రాచకొండ సీపీగా విధులు నిర్వహిస్తున్నారు.

ఆంజనేయులు.. జార్ఖండ్‌లో కలెక్టర్



ఆంజనేయులు

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట పరిధి అబాది జమ్మికుంటకు చెందిన దొడ్డె పోచయ్య–మణెమ్మ దంపతుల కుమారుడు ఆంజనేయులు. పోచయ్య మున్సిపల్ కార్మికుడిగా పనిచేసి, గతంలోనే చనిపోయాడు. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకున్న ఆంజనేయులు ఉన్నత చదువులు చదివి, 2011లో జార్ఖండ్ కేడర్ ఐఏఎస్‌గా ఎంపికయ్యారు. గతంలో ఆ రాష్ట్రంలోని రాల్‌గఢ్, ధన్‌బాద్, పలామూ, సరికెలా కలెక్టర్‌గా పని చేశారు. ప్రస్తుతం డూంకా జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

మకరంద్.. మున్సిపల్ కమిషనర్



మకరంద్

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటకు చెందిన మంద మకరంద్ 2020లో ఐఏఎస్‌గా ఎంపికయ్యారు. జగిత్యాల అదనపు కలెక్టర్‌గా పని చేసిన ఆయన ప్రస్తుతం నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తల్లిదండ్రులు నిర్మల–సురేశ్ ప్రభుత్వ ఉపాధ్యాయులు. ఇంజినీరింగ్ పూర్తయ్యాక ఓ ప్రముఖ కంపెనీలో ఏడాదికి రూ.30 లక్షల ప్యాకేజీతో పనిచేసి రాజీనామా చేశారు. యూపీఎస్సీ కోసం సన్నద్ధమై, విజయం సాధించారు. ఐఏఎస్ కావాలనుకునేవారు సమయం వృథా చేయొద్దని, ప్రిపరేషన్‌కు ప్రాముఖ్యత ఇవ్వాలని సూచిస్తున్నారు.

రజనీకాంత్.. మహారాష్ట్రలో ఏఎస్పీ



రజనీకాంత్

కరీంనగర్ క్రైం: కరీంనగర్‌లోని తిరుమల్‌నగర్‌కు చెందిన చిలుముల రజనీకాంత్ 2021 బ్యాచ్ ఐపీఎస్ ఆఫీసర్. తొలి పోస్టింగ్ మహారాష్ట్రలోని యవత్మాల్ జిల్లా దార్వ సబ్ డివిజన్‌లో ఏఎస్పీగా పని చేస్తున్నారు. ఐఐటీ మద్రాస్‌లో ఎంటెక్ పూర్తి చేసి, రెండేళ్లు ప్రైవేట్ ఉద్యోగం చేశారు. 2017లో సివిల్స్ రాశారు. ఇంటర్వ్యూ వరకు వెళ్లి, విఫలమయ్యారు. రెండోసారి ఎంపికై, ఢిల్లీలో పోస్టల్ అసిస్టెంట్ కంట్రోలర్‌గా పని చేశారు. మూడోసారి సివిల్స్ రాసి, ఐపీఎస్‌గా ఎంపికయ్యారు. ఆయన తల్లిదండ్రులు అరుణ–సుదర్శన్ ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులే. సుదర్శన్ రిటైర్ అయ్యారు. ఐఏఎస్ రంగరాజన్ సూచనలు పాటిస్తూ ఐపీఎస్ సాధించారు.

క్లుప్తంగా

ఒమన్‌లో గుండెపోటుతో ఒడ్డెలింగాపూర్ వాసి మృతి


అశోక్ (ఫైల్)

రాయికల్(జగిత్యాల): రాయికల్ మండలం ఒడ్డెలింగాపూర్ గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు పాలకుర్తి అశోక్ (39) గుండెపోటుతో ఒమన్‌లో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు శనివారం తెలిపారు. అశోక్ ఏడాది క్రితం ఉపాధి నిమిత్తం ఒమన్ వెళ్లాడు. పనిచేస్తున్న సమయంలో ఒక్కసారిగా గుండెపోటు రావడంతో గమనించిన తోటి కార్మికులు ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య హేమశ్రీ, కుమారుడు సుశాంత్ ఉన్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.


తాళం వేసిన ఇంట్లో చోరీ

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణం బీట్‌బజార్ ప్రాంతంలో నివాసం ఉండే మెడపట్ల జలపతి ఇంట్లో దొంగలు చోరీ చేశారు. బంగారు ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. పోలీసుల వివరాలు.. రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన మెడపట్ల జలపతి ఆరేళ్లుగా బీట్‌బజార్‌లో అద్దెకుంటున్నాడు. ఈనెల 24న ఇంటికి తాళం వేసి స్వగ్రామానికి వెళ్లాడు. తిరిగి శనివారం ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువా ఓపెన్ చేసి ఉండటంతో ఆందోళనకు గురై పోలీసులకు సమాచారం అందించాడు. బీరువాను తనిఖీ చేయగా సుమారు 7 తులాల బంగారు ఆభరణాలు, రూ.80 వేల నగదుతో పాటు, ఎఫ్డీ బాండ్‌పేపర్‌లు కన్పించడం లేదని బాధితుడు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై కిరణ్ తెలిపారు.

జగిత్యాలలో ద్విచక్రవాహనం..

జగిత్యాలక్రైం: జగిత్యాల కొత్తబస్టాండ్‌లో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని దొంగలు ఎత్తుకెళ్లారు. పోలీసుల వివరాలు.. జగిత్యాల గంజ్‌రోడ్‌కు చెందిన పెండెం గంగాధర్ ఈ నెల 22న జగిత్యాల కొత్తబస్టాండ్‌లో ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేసి మెట్‌పల్లి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి వాహనం కన్పించకపోవడంతో పలు ప్రాంతాల్లో వెతికినా దొరకలేదు. బాధితుడు శనివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై చంద్రయ్య తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి


శివకుమార్ మృతదేహం

మానకొండూర్: మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన మయోజుల శివకుమార్ (25) శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతిచెందాడు. వివరాలు.. శివకుమార్ కరీంనగర్‌లో రాపిడ్ ఆన్‌లైన్ సర్వీసెస్‌లో పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై గట్టుదుద్దెనపల్లికి వెళ్తుండగా మానకొండూర్ పోలీస్‌స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు.

కుక్కదాడిలో బాలుడికి గాయాలు

కోనరావుపేట: మండలంలోని వట్టిమల్లలో కుక్కదాడిలో ఓ బాలుడికి గాయాలయ్యాయి. వట్టిమల్ల కు చెందిన తులసిమొగ్గ అయాన్ తండ్రి కృష్ణస్వామి తో కలిసి ఆలయంలో పూజాకార్యక్రమానికి వెళ్లా డు. తండ్రి పూజ చేస్తుండగా అయాన్ నిలబడి ఉ న్నాడు. కుక్కదాడిచేయడంతో తీవ్ర గాయాలయ్యా యి. చికిత్స నిమిత్తం అయాన్‌ను సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి తరలించారు. గ్రామాల్లో కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వీటి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


చింతకుంట శిక్షణ శిబిరంలో వాలీబాల్ క్రీడాకారిణులు


ఆర్చరీ సాధన చేస్తున్న క్రీడాకారులు

రేపటి నుంచి రాష్ట్రస్థాయి పోటీలు

- కరీంనగర్‌లో ఆర్చరీ, గోదావరిఖనిలో వాలీబాల్ పోటీల నిర్వహణ
- పాత 10 జిల్లాల నుంచి రానున్న క్రీడాకారులు, కోచ్‌లు
- ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

కరీంనగర్ స్పోర్ట్స్: క్రీడా సందడి మొదలైంది. కరోనా కారణంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గత నాలుగేళ్లలో అడపాదడపా పోటీలు జరిగాయి. ప్రస్తుతం 2024–25 సంవత్సరానికి గానూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా షెడ్యూల్ విడుదల చేయడంతో మైదానాలు క్రీడాకారులతో కళకళలాడనున్నాయి. కరీంనగర్ జిల్లా కేంద్రం రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు, గోదావరిఖని వాలీబాల్ పోటీలకు వేదికవుతున్నాయి.

ఆర్చరీకి సుమారు 280 మంది..

కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలోని తేజస్ జూనియర్ కళాశాల ఆవరణలో 68వ రాష్ట్రస్థాయి కళాశాలల అండర్–19 బాలబాలికల ఆర్చరీ పోటీలు ఈ నెల 28 నుంచి 30 వరకు జరగనున్నాయి. ఈ పోటీలకు పాత 10 జిల్లాల నుంచి సుమారు 280 మంది క్రీడాకారులు, టెక్నికల్ అధికారులు, కోచ్‌లు, మేనేజర్లు రానున్నారు. క్రీడాకారులకు ఉచిత భోజన వసతి కల్పిస్తున్నట్లు కళాశాలల క్రీడా సమాఖ్య ఉమ్మడి జిల్లా కార్యదర్శి జి.మధుజాన్సన్ తెలిపారు. బాలురకు తేజస్ కళాశాలలో, బాలికలకు వీ పార్క్ హోటల్లో వసతిని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర పోటీల్లో విజయం సాధించిన 12 బాలురు, 12 మంది బాలికలను నవంబర్ 14 నుంచి 16 వరకు గుజరాత్ రాష్ట్రంలోని నడియాడ్‌లో జరిగే 68వ జాతీయస్థాయి కళాశాలల అండర్–19 బాలబాలికల ఆర్చరీ పోటీలకు తెలంగాణ జట్టుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఇండియన్ స్టైల్, రికర్వ్, కంపౌండ్ విభాగాల్లో పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.


గోదావరిఖని జేఎన్ స్టేడియంలో ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

వాలీబాల్‌కు సుమారు 300 మంది..

గోదావరిఖనిలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో 68వ రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్–17 బాలబాలికల వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలు ఈ నెల 28 నుంచి 30 వరకు జరగనున్నాయి. ఈ పోటీలకు పాత 10 జిల్లాల నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు, టెక్నికల్ అధికారులు, కోచ్‌లు, మేనేజర్లు రానున్నారు. క్రీడాకారులకు ఉచిత భోజన వసతి కల్పిస్తున్నట్లు పాఠశాలల క్రీడా సమాఖ్య పెద్దపల్లి జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. స్టేడియంలో వసతిని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర పోటీల్లో విజయం సాధించిన 12 మంది బాలురు, 12 మంది బాలికలను నవంబర్ 6 నుంచి 10 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని రాయ్‌బరేలీలో జరగనున్న 68వ జాతీయస్థాయి పాఠశాలల అండర్–17 బాలబాలికల వాలీబాల్ పోటీలకు తెలంగాణ జట్టుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. 3 అధునాతనమైన కోర్టులను ఏర్పాటు చేశామన్నారు. ఫ్లడ్ లైట్ల వెలుతురులోనూ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అట్టహాసంగా నిర్వహిస్తాం



రాష్ట్రస్థాయి పోటీలను అట్టహాసంగా నిర్వహిస్తాం. ఇందుకోసం 15 రోజులుగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. గోదావరిఖని జేఎన్ఎస్ స్టేడియం వేదికగా జరగనున్న వాలీబాల్ పోటీలను చూసేందుకు అధిక సంఖ్యలో క్రీడాభిమానులు రానున్న నేపథ్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

– కె.శ్రీనివాస్, పాఠశాలల క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శి, పెద్దపల్లి

ఏర్పాట్లు పూర్తి చేశాం



సుమారు నాలుగేళ్ల తర్వాత కరీంనగర్ జిల్లాలో అండర్–19 విభాగంలో రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలు నిర్వహిస్తున్నాం. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. జిల్లాకు చెందిన క్రీడాకారులకు శిక్షణనిచ్చాం. జిల్లా టీం చాలా బాగుంది. పోటీలను విజయవంతం చేస్తాం.

– జి.మధుజాన్సన్, కళాశాలల క్రీడా సమాఖ్య ఉమ్మడి జిల్లా కార్యదర్శి

డిపాజిట్ల గల్లంతుపై ఆందోళన

- పోస్టాఫీసు ఎదుట ఖాతాదారుల నిరసన
- విచారణ జరుపుతున్న ఉన్నతాధికారులు

రామగిరి(మంథని): పొదుపు ఖాతాల్లో జమచేసిన సొమ్ము మాయం కావడంపై పలువురు ఖాతాదారులు శనివారం కూడా పోస్టాఫీసు ఎదుట ఆందోళన నిర్వహించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సెంటనరీకాలనీ బ్రాంచ్ పరిధిలోని బేగంపేట పోస్టాఫీసులో 16 నెలలుగా విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగి నకిలీ పాసుపుస్తకాలతో తాము డిపాజిట్ చేసిన సొమ్మును తమ సొంతానికి వినియోగించుకున్నారని ఆరోపించారు. తమ కూతుళ్లు రంగం సానివ్రత, రంగం కృతిక పేరిట 2024 జనవరి 31న కొంత సొమ్ము డిపాజిట్ చేశానని బేగంపేటకు చెందిన బాధితురాలు రంగం శోభ తెలిపింది. నకిలీ పాసు పుస్తకంతో తన ఖాతాలోని సొమ్ము మాయం చేశారని వాపోయింది. ఈవిషయం బయటకు తెలియడంతో సుమారు 40 మంది తపాలా కార్యాలయానికి వెళ్లి పుస్తకాలు తనిఖీ చేయించగా అవి కూడా నకిలీగా తేలాయని బాధితులు పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.


విచారణ జరుపుతున్న ఉన్నతాధికారులు

ఘటనపై విచారణ..

డిపాజిట్ల గల్లంతుపై ఉన్నతాధికారులు పోస్టాఫీసులో విచారణ చేపట్టారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, సుకన్య సమృద్ధి యోజన పాస్ పుస్తకాలు తనిఖీ చేయగా కొన్ని నకిలీవని తేలింది. డిపాజిట్‌దారులు అందించిన రసీదులు పరిశీలించగా చాలావరకు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని తేలింది. ఇలా సుమారు 32 మంది ఖాతాదారుల పుస్తకాలు నకిలీవని, రూ.32.60 లక్షలు స్వాహా అయ్యాయని గుర్తించారు. అలాగే ఒకేఖాతాదారు పేరిట 80 పాస్ పుస్తకాలు ఉన్నాయని పేర్కొన్నారు. పోస్టాఫీస్‌లో సుమారు 1,000 వరకు ఖాతాల్లో దాదాపు 300 ఖాతాల్లో మోసం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ మోహన్ తెలిపారు.


పోస్టాఫీస్ ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

తెలంగాణ ఆర్టిజన్ కన్వెన్షన్ జేఏసీ సమావేశం

కొత్తపల్లి(కరీంనగర్): తెలంగాణ ఆర్టిజన్ కన్వెన్షన్ జేఏసీ నాయకుల సమావేశం శనివారం కరీంనగర్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర నాయకులు రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్ శాఖలో ఆర్టిజన్ కార్మికులు 19 వేల మందికి పైగా పని చేస్తున్నారని, వారిని ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని గతంలో కోరినట్లు పేర్కొన్నారు. ఇపటికైనా సీఎం రేవంత్‌రెడ్డి తమ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కమిటీ చైర్మన్‌గా గుగులోతు శివకృష్ణ, కన్వీనర్‌గా జీవన్, కో చైర్మన్‌గా శివ, సంతోష్, కో కన్వీనర్‌గా మద్దెల శ్రీనివాస్, పి.శ్రీనివాస్, సోషల్ మీడియాకు కె.శ్రీనివాస్‌ను సభ్యులుగా ఎన్నుకున్నారు.

‘గంగుల’కు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరామర్శ


నివాళి అర్పిస్తున్న ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తదితరులు

కరీంనగర్ కార్పొరేషన్: మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను శనివారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించారు. ఇటీవల గంగుల తల్లి లక్ష్మినర్సమ్మ మృతి చెందడంతో, క్రిస్టియన్‌కాలనీలోని ఆయన నివాసంలో నేతలు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పరామర్శించిన వారిలో బెజ్జంకి మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, కాంగ్రెస్ నాయకులు కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, మడుపు మోహన్, ఇన్నారెడ్డి, గడ్డం శ్రీరామ్, బొమ్మ ఈశ్వర్‌గౌడ్, బోనాల మురళి ఉన్నారు.

రాజన్న సన్నిధిలో ముస్లిం కుటుంబం

- నిలువెత్తు బంగారం, అభిషేక పూజలు

వేములవాడరూరల్: భక్తులు ప్రేమతో భోళా శంకరుడిగా పిలుచుకునే వేములవాడ రాజన్నను శనివారం ఓ ముస్లిం కుటుంబం దర్శించుకుంది. రాజన్న సన్నిధిలో దర్గా ఉండడంతో ఇక్కడికి హిందువులతోపాటు ముస్లింలు కూడా వస్తుంటారు. ఈక్రమంలోనే శనివారం జగిత్యాల ప్రాంతానికి చెందిన ఓ ముస్లిం కుటుంబం రాజన్నను దర్శించుకోవడంతోపాటు వారి పిల్లల నిలువెత్తు బంగారం, అభిషేకం పూజలు చేశారు. ఇక్కడి నుంచి కొమురవెల్లి మల్లికార్జునస్వామి దర్శనానికి బయలుదేరి వెళ్లారు.


రాజన్నకు ప్రత్యేక మొక్కులు చెల్లించిన ముస్లిం కుటుంబసభ్యులు




అంజన్నకు మొక్కులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న సన్నిధిలో శనివారం రద్దీ నెలకొంది. భక్తులు తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఏర్పాట్లను ఈవో రామకృష్ణారావు, సిబ్బంది పర్యవేక్షించారు.



మోడల్‌చెరువు సమీపంలో ఎలుగుబంటి సంచారం


పొలాల వద్ద ఎలుగుబంటి

హుజురాబాద్‌రూరల్: హుజూరాబాద్ పట్టణ పొలిమేరలోని మోడల్‌చెరువు వద్ద ఎలుగుబంటి సంచారం క లకలం రేపింది. శనివారం సాయంత్రం అటుగా వె ళ్తున్నవారు గుర్తించి సెల్‌ఫోన్‌లో ఎలుగుబంటి వీ డియో, ఫొటోలు తీశారు. మోడల్‌చెరువు సమీ పంలోని మామిండ్లవాడ, రెడ్డికాలనీ వాసులు ఆందో ళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు స్ప ందించి ఎలుగుబంటిని పట్టుకోవాలని కోరుతున్నారు.

పత్తి కొనుగోళ్లపై సందేహాలా?

- నేడే డీఎంవోతో ‘సాక్షి’ ఫోన్‌ఇన్


డి.ప్రకాశ్

కరీంనగర్ అర్బన్: ఉమ్మడి జిల్లాలో ఇప్పుడిప్పుడే పత్తి కొనుగోళ్లు ఊపందుకుంటున్నాయి. సీసీఐ పలు మార్కెట్లలో కొనుగోళ్లు ప్రారంభించింది. వ్యాపారులు మద్దతు ధర కన్నా తక్కువగానే కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలో కొనుగోలులో వచ్చిన మార్పులతో పాటు సాంకేతికతపై రైతులకు సదరు అధికారి అవగాహన కల్పించనున్నారు. మార్కెట్లలో సౌకర్యాలు, కనీస మద్దతు ధర, జిన్నింగ్ మిల్లుల్లో సమస్యలు, తూకంలో తేడాలు, తేమ సమస్యలు వంటి అంశాలపై ‘సాక్షి’ నేడు ఫోన్‌ఇన్ నిర్వహిస్తోంది. జిల్లా మార్కెటింగ్ అధికారి దుర్గం ప్రకాశ్‌తో నేరుగా రైతులు నేరుగా మాట్లాడి సమస్యలను ప్రస్తావించొచ్చు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించవచ్చు.

సమయం: ఆదివారం ఉదయం 10 నుంచి 11గంటల వరకు
సంప్రదించాల్సిన ఫోన్ నంబర్: 9989575683

సాక్షి ఫోన్ ఇన్

ఎస్సై, ఏఎస్సై, ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్ల సస్పెన్షన్


సోనియా

గోదావరిఖని/కాగజ్‌నగర్‌రూరల్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ రూరల్ పోలీసుస్టేషన్‌లో ఓ కేసును పక్కదారి పట్టించిన అప్పటి ఎస్సై, ఏఎస్సై, ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ మల్టీజోన్–1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ విధులు నిర్వర్తించిన సమయంలో అవినీతికి పాల్పడడంతో ఎస్సై సోనియా, ఏఎస్సై మను, హెడ్‌కానిస్టేబుళ్లు ఉమేశ్, రమేశ్ సస్పెండ్‌కు గురయ్యారు. ఆగస్టు 3న కాగజ్‌నగర్ మండలం బురదగూడ గ్రామానికి చెందిన కొట్రంగి శ్యాంరావు(36) ప్రమాదవశాత్తు ఇంట్లోనే మంచె మీది నుంచి కిందపడి మృతిచెందినట్లు తల్లి కొట్రంగి భీంబాయి ఫిర్యాదు చేసింది. ఈ కేసు విషయంలో మొదటి నుంచి అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీంతో కొందరు గ్రామస్తులు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఖననం చేసిన శ్యాంరావు మృతదేహానికి ఆగస్టు 16న ఆర్డీవో సురేష్, ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో రీపోస్టుమార్టం చేశారు. కేసులో సాక్ష్యాలను తారుమారు చేయడం, అవాస్తవాలను పంచనామాలో పొందుపర్చి కేసును నిర్వీర్యం చేయడంతో అప్పటి ఎస్సై సోనియాను రామగుండం కమిషనరేట్ పరిధిలోని గోదావరిఖని –2టౌన్ ఎస్సైగా బదిలీ చేశారు. తాజాగా రీపోస్టుమార్టం నివేదిక ఆధారంగా ఎస్సై, మరో ముగ్గురు పోలీసు అధికారులపై సస్పెన్షన్ వేటు పడింది.

ఎమ్మెల్యే కాన్వాయ్.. రాంగ్‌రూట్

తిమ్మాపూర్(మానకొండూర్): తిమ్మాపూర్ తహసీల్దార్ కార్యాలయానికి శనివారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వెంటనే చేరుకున్నారు. అక్కడికి వచ్చిన ఎంజేపీ పాఠశాల ప్రిన్సిపాల్‌తో ఇద్దరూ మాట్లాడారు. అనంతరం మంత్రి చిగురుమామిడి మండల పర్యటనకు వెళ్లారు. ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయానికి బయలుదేరారు. ఆ సమయంలో ఆయన కాన్వాయ్ రాంగ్‌రూట్‌లో రోడ్డు దాటింది. పోలీస్‌స్టేషన్ ఎదుటే ఇలా జరగడం చర్చనీయాంశమైంది. వాహనాలు రాంగ్‌రూట్‌లో వెళ్లడాన్ని కొంతమంది ఫొటోలు తీసి, సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఎమ్మెల్యే గారూ.. ఇది తగునా.. ఎమ్మెల్యేకు రూల్స్ వర్తించవా అంటూ కొందరు నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. తక్కువ దూరమే ఉండటంతో కాన్వాయ్ అలా వెళ్లినట్లు తెలిసింది.


రాణా ఎదుట రాంగ్‌రూట్‌లో వెళ్తున్న వాహనాలు

దళితుడిపై దాడికి పాల్పడిన
అటెండర్‌పై చర్యలకు సిఫారసు

- డిప్యూటీ తహసీల్దార్‌తో క్షమాపణలు చెప్పిస్తా : తహసీల్దార్ రమేశ్


తహసీల్దార్ రమేశ్

చిగురుమామిడి: భూమి పట్టా చేయమని కోరినందుకు మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన మాతంగి తిరుపతిపై దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అటెండర్ రాజేందర్‌పై చర్యలకు ఆర్డీవోకు సిఫారసు చేస్తామని చిగురుమామిడి తహసీల్దార్ ఎం.రమేశ్ తెలిపారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతూ.. దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న డిప్యూటీ తహసీల్దార్ పార్థసారధిని ఆర్డీవో కె.మహేశ్వర్, తాను హెచ్చరించామని, అవసరమైతే తిరుపతికి క్షమాపణలు చెప్పిస్తామని అన్నారు. భూమికి సంబంధించిన ఎలాంటి ఆధారాలున్నా తనకు సమర్పిస్తే తిరుపతికి న్యాయం చేస్తానని వివరించారు. రెవెన్యూ కార్యాలయానికి వచ్చేవారితో అధికారులు మర్యాదగా ప్రవర్తించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని తెలిపారు.

లక్ష్యంతో ముందుకు సాగాలి

- జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు


మాట్లాడుతున్న రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు

కరీంనగర్‌రూరల్: విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగినప్పుడే విజయం సాధిస్తారని జేఎన్‌టీయూ హైదరాబాద్ రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు సూచించారు. బొమ్మకల్‌లోని ట్రినిటి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం గ్రామీణ విద్యార్థులకు సాంకేతిక విద్యపై నిర్వహించిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకుని, సాంకేతికను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. జేఎన్‌టీయూ అందించే కరిక్యులం ద్వారా విద్యార్థులు శిక్షణ పొందడంతో సమాజానికి సేవచేసే అవకాశం ఉంటుందని తెలిపారు. రాబోయే రోజుల్లో జేఎన్‌టీయూ ఇన్‌స్ట్రాగాం పేజీని ప్రారంభించి ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తామని అన్నారు. విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలను కల్పించేలా విద్యా ప్రణాళికను రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రినిటి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నాగేందర్‌సింగ్, మణిగణేశ్, అశోక్‌కుమార్, కిశోర్, ఏవో రాజశేఖర్ పాల్గొన్నారు.

బీడీ పరిశ్రమపై ఆంక్షలు తొలగించాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి


ర్యాలీలో చాడ వెంకటరెడ్డి, నాయకులు

మల్యాల(చొప్పదండి): రాష్ట్రంలో కుటీర పరిశ్రమ అయిన బీడీ పరిశ్రమపై ఆంక్షలు తొలగించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. శనివారం మల్యాల మండల కేంద్రంలో బీడీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు కొక్కుల శాంత అధ్యక్షతన నిర్వహించిన బీడీ కార్మిక సంఘం(ఏఐటీయూసీ) జిల్లా రెండో మహాసభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక బ్లాక్ చౌరస్తాలో జెండా ఎగురవేసి బీడీ కార్మికులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ఫంక్షన్ హాల్‌లో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు, బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.గోవర్దన్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టి.సమ్మయ్య, బోయిని అశోక్, ఎర్దండి భూమయ్య, బీడీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు శాంత మాట్లాడారు. బీడీ కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని, బీడీ కట్టలపై ఉన్న గుర్తులను తొలగించాలన్నారు. ప్రభుత్వం ఆదుకొని, ఇల్లు లేని కార్మికులకు ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ప్రతి కార్మికురాలికి పెన్షన్ ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ రూ.2,000 నుంచి రూ.4,000 పెంచాలన్నారు. జిల్లాకో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేసి, అన్నిరకాల వైద్య సేవలను ఉచితంగా అందజేయాలని డిమాండ్ చేశారు. ఈపీఎఫ్ పెన్షన్ రూ.6వేలకు పెంచాలన్నారు. బీడీ కా ర్మిక సంఘం (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి సుతారి రాములు, కోశాధికారి ఎండీ ముఖ్రం, ఎండీ మౌలానా, ఎన్నం రాధ, కిరణ్, దేవదాస్, లక్ష్మీరమ, అనసూర్య, కడారి రాములు పాల్గొన్నారు.

ఏజెంట్, మధ్యవర్తి అరెస్ట్

జగిత్యాలక్రైం: నిరుద్యోగ యువకులను కంప్యూటర్ ఆపరేటర్ డాటా ఎంట్రీ పేరుతో లావోస్ దేశం పంపించి మోసం చేసిన ఏజెంట్ గాజర్ల వంశీని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ అధికారులు అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నారు. రాయికల్ మండలం తాట్లవాయి గ్రామానికి చెందిన ముగ్గురు, జగిత్యాల పట్టణానికి చెందిన ఓ వ్యక్తిని లావోస్‌లో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి వారి నుంచి రూ.1.50 లక్షలు వసూలు చేశాడు. సదరు యువకులు అక్కడికి వెళ్లిన తర్వాత కంపెనీకి చెందినవారు సైబర్‌నేరాలు చేయాలని సూచించడంతో వీరు అక్కడి తెలుగువారి సహాయంతో అతికష్టం మీద పాస్‌పోర్టులు తీసుకుని వెనుదిరిగి వచ్చారు. దీంతో బాధితులు మూడు రోజుల క్రితం జగిత్యాల ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో ఏజెంట్‌ను సైబర్ పోలీసులు అదుపులోకి తీసుకుని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులకు శుక్రవారం అప్పగించారు. కాగా ఏజెంట్ గాజర్ల వంశీ, మధ్యవర్తి రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన పాలకుర్తి సురేశ్‌పై కేసు నమోదు చేసినట్లు హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు తెలిపారు. ఇందులో మధ్యవర్తిగా వ్యవహరించిన మరో వ్యక్తి జగిత్యాలకు చెందిన రాజేందర్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.



జోహర్ కప్‌లో యువ భారత్‌కు కాంస్య పతకం

సుల్తాన్ జొహర్ కప్ అండర్–21 అంతర్జాతీయ పురుషుల హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు కాంస్య పతకం కైవసం చేసుకుంది. మలేసియా వేదికగా శనివారం జరిగిన కాంస్య పతక పోరులో భారత జట్టు షూటౌట్‌లో న్యూజిలాండ్‌ను చిత్తు చేసి కాంస్యం ఖాతాలో వేసుకుంది. గోల్‌కీపర్ బిక్రమ్‌జిత్ సింగ్ ప్రత్యర్థి మూడు గోల్స్ ప్రయత్నాలను అడ్డుకోవడంతో భారత జట్టు విజయం సాధించింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు రెండేసి గోల్స్ చేయగా... ఫలితం తేల్చేందుకు నిర్వహించిన షూటౌట్‌లో భారత్ 3–2తో గెలుపొందింది. షూటౌట్‌లో భారత్ తరఫున గుర్‌జోత్ సింగ్, మన్‌మీత్ సింగ్, సౌరభ్ ఆనంద్ గోల్ కొట్టారు. అంతకుముందు భారత్ తరఫున దిల్‌రాజ్ సింగ్ (11వ నిమిషంలో), మన్‌మీత్ సింగ్ (20వ ని.లో) ఒక్కో గోల్ చేయగా... న్యూజిలాండ్ తరఫున బ్రౌన్ (51వ ని.లో), జాంటీ ఎల్మ్స్ (57వ ని.లో) చెరో గోల్ చేశారు. ఆరంభం నుంచి మ్యాచ్‌పై పట్టు కొనసాగించిన భారత జట్టు... చివరి క్వార్టర్‌లో ప్రత్యర్థికి కోలుకునే అవకాశం ఇచ్చింది.

‘కివీ’ చేతుల్లో ఖేల్ ఖతం!

అనూహ్యం, అసాధారణమేమీ జరగలేదు... న్యూజిలాండ్‌తో రెండో టెస్టులో భారత బ్యాటర్లు రెండో ఇన్నింగ్స్‌లోనూ తమ వైఫల్యాన్ని కొనసాగించారు...భారీ లక్ష్యాన్ని ఛేదించలేక కుప్పకూలి సిరీస్‌ను అప్పగించేశారు... సొంతగడ్డపై కూడా స్పిన్‌ను ఆడలేని తమ బలహీనతను మళ్లీ ప్రదర్శిస్తూ టీమిండియా తలవంచింది...ఫలితంగా పుష్కర కాలం తర్వాత స్వదేశంలో టెస్టు సిరీస్ చేజారింది... ఒక్క యశస్వి జైస్వాల్ మాత్రమే ధాటిగా ఆడి ఆశలు రేపినా... మిగతావారంతా చేతులెత్తేయడంతో మూడో రోజుకే మ్యాచ్ ముగిసింది... కివీ బౌలర్ సాంట్నర్ మరోసారి తన మాయాజాలం ప్రదర్శిస్తూ ఆరు వికెట్లతో చెలరేగాడు. శ్రీలంక చేతిలో చిత్తుగా ఓడి ఏమాత్రం అంచనాలు, ఆశలు లేకుండా భారత గడ్డపై అడుగుపెట్టిన న్యూజిలాండ్ బృందం అసాధారణ ప్రదర్శనతో ఏకంగా 2–0తో సిరీస్‌నే గెలుచుకోవడం విశేషం. ఇక భారత్ ముందు మిగిలింది చివరి మ్యాచ్‌లో నెగ్గి కాస్త పరువు కాపాడుకోవడమే!


విజయానందంలో న్యూజిలాండ్ ఆటగాళ్లు


సాంట్నర్

రెండో టెస్టులో భారత్ ఓటమి

- 113 పరుగుల తేడాతో న్యూజిలాండ్ ఘన విజయం
- 2–0తో సిరీస్ సొంతం
- రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 245 ఆలౌట్
- శుక్రవారం నుంచి చివరి టెస్టు

పుణే: స్వదేశంలో భారత జట్టు అనూహ్య రీతిలో టెస్టు సిరీస్‌ను కోల్పోయింది. శనివారం ముగిసిన రెండో టెస్టులో న్యూజిలాండ్ 113 పరుగుల తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. తొలి మ్యాచ్‌లోనూ నెగ్గిన ఆ జట్టు మరో టెస్టు మిగిలి ఉండగానే సిరీస్‌ను 2–0తో సొంతం చేసుకుంది. 359 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 60.2 ఓవర్లలో 245 పరుగులకు ఆలౌటైంది. యశస్వి జైస్వాల్ (65 బంతుల్లో 77; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడి అర్ధసెంచరీ చేయగా, రవీంద్ర జడేజా (84 బంతుల్లో 42; 2 ఫోర్లు) చివర్లో కాస్త పోరాడాడు. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ మిచెల్ సాంట్నర్ (6/104) మరోసారి భారత్‌ను దెబ్బ కొట్టాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 198/5తో ఆట కొనసాగించిన న్యూజిలాండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 69.4 ఓవర్లలో 255 పరుగులకు ఆలౌటైంది. ఫిలిప్స్ (48 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), బ్లన్‌డెల్ (41; 3 ఫోర్లు) కీలక పరుగులు సాధించారు. భారత బౌలర్లలో సుందర్ 4, జడేజా 3 వికెట్లు తీశారు. ఇరు జట్ల మధ్య మూడో టెస్టు నవంబర్ 1 నుంచి ముంబైలో జరుగుతుంది.

జైస్వాల్ మినహా...

క్రీజ్‌లో జైస్వాల్ ఉన్నంత సేపు భారత జట్టు లక్ష్యంపై గురి పెట్టి దూకుడైన ఆటను ప్రదర్శించేందుకు సిద్ధమైందని అనిపించింది. ఒక వైపు రోహిత్ (8) మళ్లీ విఫలమైనా...మరో ఎండ్‌లో జైస్వాల్ తొలి ఓవర్‌నుంచే బౌండరీలతో చెలరేగాడు. అతనికి శుబ్‌మన్ గిల్ (23) కూడా కొద్ది సేపు సహకరించాడు. లంచ్ సమయానికి భారత్ 81/1తో మెరుగైన స్థితిలో కనిపించగా... విరామం తర్వాత 41 బంతుల్లోనే జైస్వాల్ అర్ధసెంచరీ పూర్తయింది. అయితే రెండో సెషన్‌లో గిల్‌ను అవుట్ చేసి పతనానికి శ్రీకారం చుట్టిన సాంట్నర్ ఆ తర్వాత జైస్వాల్ వికెట్‌నూ ఖాతాలో వేసుకున్నాడు. మరో ఐదు బంతులకే పంత్ (0) అనవసరపు సింగిల్‌కు ప్రయత్నించి రనౌట్ కావడం జట్టును మరింత దెబ్బ తీసింది. కోహ్లి పాయింట్ దిశగా ఆడి పరుగు ప్రారంభించగా... పంత్ మరో ఆలోచన లేకుండా దూసుకొచ్చాడు. అయితే అతను డైవ్ చేసినా లాభం లేకపోయింది. కోహ్లి (17)ని సాంట్నర్ ఎల్బీగా దొరకబుచ్చుకోగా, భారత బ్యాటర్ రివ్యూ చేసినా ఫలితం దక్కలేదు. అనంతరం రెండు పరుగుల వ్యవధిలో సర్ఫరాజ్ (9), సుందర్ (21) అవుటయ్యారు. జడేజా, అశ్విన్ (18) కొద్ది సేపు ప్రతిఘటించినా... అదీ ఎక్కువ సేపు సాగలేదు. అంతకు ముందు న్యూజిలాండ్ మూడో రోజు మరో 16.4 ఓవర్లు ఆడి మరో 57 పరుగులు జోడించగలిగింది.

స్కోరు వివరాలు:

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ 259; భారత్ తొలి ఇన్నింగ్స్ 156; న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్: లాథమ్ (ఎల్బీ) (బి) సుందర్ 86; కాన్వే (ఎల్బీ) (బి) సుందర్ 17; యంగ్ (ఎల్బీ) (బి) అశ్విన్ 23; రచిన్ (బి) సుందర్ 9; మిచెల్ (సి) జైస్వాల్ (బి) సుందర్ 18; బ్లన్‌డెల్ (బి) జడేజా 41; ఫిలిప్స్ (నాటౌట్) 48; సాంట్నర్ (సి) బుమ్రా (బి) జడేజా 4; సౌతీ (సి) రోహిత్ (బి) అశ్విన్ 0; ఎజాజ్ (సి) సుందర్ (బి) జడేజా 1; రూర్కే (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (69.4 ఓవర్లలో ఆలౌట్) 255.**
వికెట్ల పతనం: 1–36, 2–78, 3–89, 4–123, 5–183, 6–231, 7–237, 8–238, 9–241, 10–255. **బౌలింగ్:** అశ్విన్ 25–2–97–2, సుందర్ 19–0–56–4, జడేజా 19.4–3–72–3, బుమ్రా 6–1–25–0. **భారత్ రెండో ఇన్నింగ్స్:** జైస్వాల్ (సి) మిచెల్ (బి) సాంట్నర్ 77; రోహిత్ (సి) యంగ్ (బి) సాంట్నర్ 8; గిల్ (సి) మిచెల్ (బి) సాంట్నర్ 23; కోహ్లి (ఎల్బీ) (బి) సాంట్నర్ 17; పంత్ (రనౌట్) 0; సుందర్ (సి) యంగ్ (బి) ఫిలిప్స్ 21; సర్ఫరాజ్ (బి) సాంట్నర్ 9; జడేజా (సి) సౌతీ (బి) పటేల్ 42; అశ్విన్ (సి) మిచెల్ (బి) సాంట్నర్ 18; ఆకాశ్‌దీప్ (సి) రచిన్ (బి) ఎజాజ్ 1; బుమ్రా (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (60.2 ఓవర్లలో ఆలౌట్) 245.** **వికెట్ల పతనం:** 1–34, 2–96, 3–127, 4–127, 5–147, 6–165, 7–167, 8–206, 9–229, 10–245. **బౌలింగ్:** సౌతీ 2–0–15–0, రూర్కే 1–0–5–0, సాంట్నర్ 29–2–104–6, ఎజాజ్ 12.2–0–43–2, ఫిలిప్స్ 16–0–60–1.

12 భారత జట్టు స్వదేశంలో 12 ఏళ్ల తర్వాత టెస్టు సిరీస్ కోల్పోయింది. 2012లో ఇంగ్లండ్ చేతిలో టీమిండియా 1–2తో ఓడింది.

18 తాజా ఓటమికి ముందు స్వదేశంలో భారత్ వరుసగా గెలిచిన సిరీస్‌ల సంఖ్య.

1 భారత గడ్డపై న్యూజిలాండ్‌కు ఇదే తొలి టెస్టు సిరీస్ విజయం. గతంలో కివీస్ ఇక్కడ 12 సిరీస్‌లు ఆడగా...10 ఓడి 2 డ్రా చేసుకుంది.

‘పరాభవ భారం’

‘నాపై ఇక కత్తులు దూయండి’... బెంగళూరు టెస్టులో 46కు ఆలౌట్ అయిన తర్వాత మీడియా సమావేశంలో రోహిత్ శర్మ వ్యాఖ్య ఇది!

‘12 ఏళ్ల తర్వాత ఒక సిరీస్ ఓడిపోయాం ...ఈమాత్రం మినహాయింపు ఇవ్వడంలో తప్పు లేదు’...రెండో టెస్టులో ఓటమి అనంతరం అదే కెప్టెన్ చెప్పిన మాట ఇది.



ఇన్నేళ్లుగా తమ ఆటతో విజయాలనే తాము అలవాటు చేశామని, కాబట్టి పరాజయం అందరికీ కొత్తగా అనిపిస్తోందని కూడా రోహిత్ అన్నాడు. అంటే 46 ఆలౌట్‌ను ఒకానొక అరుదైన రోజుగా అంగీకరించిన కెప్టెన్‌కు ఇప్పుడు ఓటమి అలవాటైపోయినట్లుగా అనిపించింది! అయితే ఈ పుష్కర కాలంలో అప్పుడప్పుడు వచ్చిన మ్యాచ్ పరాజయాలకు, తాజాగా సిరీస్ కోల్పోవడానికి మధ్య చాలా తేడా ఉంది. ఇన్నేళ్లలో ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలాంటి టీమ్‌లు భారత్‌ను ఓడించేందుకు తీవ్రంగా ప్రయత్నించాయి. మ్యాచ్‌లు గెలిచినా అవి సిరీస్‌ను మాత్రం సొంతం చేసుకోలేకపోయాయి. వీటితో పోలిస్తే న్యూజిలాండ్ టెస్టుల్లో అనామక జట్టు కిందే లెక్క. దీనికి ముందు 12 సిరీస్‌లలో కలిపి ఆ టీమ్ ఇక్కడ రెండే మ్యాచ్‌లు గెలవగలిగింది. పైగా ఇటీవలే శ్రీలంక చేతిలో 0–2తో చిత్తుగా ఓడి ఇక్కడకు వచ్చింది. సౌతీ, లాథమ్‌లకు మినహా మిగతావారెవరికీ ఇక్కడ టెస్టులు ఆడిన అనుభవం ఎక్కువగా లేదు. కేన్ విలియమ్సన్‌లాంటి స్టార్ ప్లేయర్ కూడా అందుబాటులో లేడు. అయినా సరే కివీస్ టీమ్ భారత్‌పై పైచేయి సాధించగలిగింది. రెండు పూర్తిగా భిన్నమైన పిచ్‌లపై ఆ జట్టు పైచేయి సాధించిన తీరు టీమిండియా లోపాలను చూపించింది. ముందుగా బెంగళూరు టెస్టులో పేస్ బౌలింగ్ ముందు భారత్ మోకరిల్లి చెత్త రికార్డులను నమోదు చేసింది. దాంతో హడావిడిగా మన బలం స్పిన్ అంటూ పూర్తిగా స్పిన్ పిచ్‌తో సిద్ధమైంది. కానీ ముందు మన బ్యాటర్లు అలాంటి పిచ్‌పై, స్పిన్‌ను సమర్థంగా ఆడగలరా లేదా అనే ఆలోచన రానట్లుంది! అందుకే సాంట్నర్ స్పిన్‌ను కూడా ఎదుర్కోలేకపోయింది. 2017లో ఇదే పుణేలో, ఇదే తరహా పిచ్‌పై ఇలాంటి లెఫ్టార్మ్ స్పిన్నర్ స్టీవ్ ఒ కీఫ్‌కు 12 వికెట్లు అప్పగించి ఆసీస్ చేతిలో భారత్ 333 పరుగులతో చిత్తయింది. ఇప్పుడు కూడా పదునైన స్పిన్‌ను ఆడటం తమ వల్ల కాదని మన బ్యాటర్లు నిరూపించారు. పిచ్‌పై గిర్రున తిరుగుతున్న బంతులకు వారి వద్ద జవాబు లేకపోయింది. బంగ్లాలాంటి బలహీన జట్టుపై దూకుడైన ఆటతో సిరీస్ గెలిచిన వైనంతో మన ప్లేయర్లలో అతి విశ్వాసం పెరిగినట్లు కనిపించింది. పైగా న్యూజిలాండ్ టెస్టుల్లో ప్రభావం చూపలేదనే తేలికపాటి భావం కూడా కావచ్చు! సిరీస్‌లో రోహిత్ విఫలం కాగా, కోహ్లి తన ఆటతో తీవ్రంగా నిరాశపర్చాడు. జైస్వాల్ ఒక్కడే ఆకట్టుకోగా, రెండో ఇన్నింగ్స్‌లో పంత్ రనౌట్ అతని నిర్లక్ష్యాన్ని చూపించింది. సాంట్నర్ చెలరేగిన చోట అదే శైలి బౌలర్ అయిన జడేజాకు తొలి ఇన్నింగ్స్‌లో ఒక్క వికెట్ కూడా దక్కలేదు. ఇదే టీమ్ ఆస్ట్రేలియాకు వెళ్లి గెలుస్తుందనుకోవడం అత్యాశే. మరో వైపు కోచ్ గౌతమ్ గంభీర్‌కు కూడా ఈ ఓటమిలో పాత్ర ఉంది. బంగ్లాపై సిరీస్ విజయాన్ని గొప్పగా చెప్పుకుంటూ...‘ఒక్క రోజులో 400 పరుగులు చేయగల, అవసరమైతే రెండు రోజులు నిలబడి డ్రా చేసుకోగల జట్టుగా మేం మారాలి. నా దృష్టిలో ఆటలో ఎదగడం అంటే అదే’ అంటూ వ్యాఖ్య చేశాడు. 400 సంగతేమో కానీ మన బ్యాటింగ్ బలహీనత ఏమిటో ఇది చూపించింది. శ్రీలంక చేతిలో 27 ఏళ్ల తర్వాత వన్డే సిరీస్ ఓటమి, 46 ఆలౌట్, 36 ఏళ్ల తర్వాత కివీస్ చేతిలో టెస్టు పరాజయం, ఇప్పుడు తొలిసారి సిరీస్, 12 ఏళ్ల తర్వాత స్వదేశంలో పరాభవం...ఇవన్నీ కూడా కోచ్ గంభీర్ ఖాతాలో చేరాల్సినవే! ఇకపై మాటలను కట్టిపెట్టి కోచ్‌గా తన బాధ్యతలు సరిగ్గా నెరవేర్చాల్సిన సమయమిది.

–సాక్షి క్రీడావిభాగం

4 రోహిత్ కెప్టెన్సీలో స్వదేశంలో భారత్ ఓడిన టెస్టుల సంఖ్య. గతంలో అజహర్, కపిల్ కెప్టెన్సీలో 4 మ్యాచ్‌లు ఓడగా... పటౌడీ నాయకత్వంలో భారత్ 9 మ్యాచ్‌లు ఓడింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా

యాభైఏళ్ల రాజీనామా


● చిరంజీవి

Mr. K. S. S. V. Prasada Rao, II B. Com., Best actor of the college 1974–75.

కొణిదెల శివ శంకర వరప్రసాద్.... ఈ పేరు తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే. హీరో చిరంజీవి అసలు పేరు ఇదే అని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కాగా శివ శంకర వరప్రసాద్‌గా రంగస్థలంపై ‘రాజీనామా’ అనే నాటకంతో మొదలైన ఆయన నట ప్రస్థానం యాభై ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా చిరంజీవి ఓ ఫొటోను తన సోషల్ మీడియా వేదికగా షేర్ చేసి, ‘‘1974లో నర్సపూర్‌లోని వైఎన్ఎమ్ కళాశాలలో బీకామ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నప్పుడు రంగస్థలం మీద నేను వేసిన తొలి నాటకం ‘రాజీనామా’. కోన గోవిందరావుగారు రచించారు. నాకు నటుడిగా తొలి గుర్తింపు ఇచ్చింది ‘రాజీనామా’. అది కూడా బెస్ట్ యాక్టర్‌గా అవార్డు రావడం ఎనలేని ప్రోత్సాహం ఇచ్చింది. 1974–2024... యాభై సంవత్సరాల నట ప్రస్థానం ఎనలేని ఆనందాన్ని ఇచ్చింది’’ అంటూ రాసుకొచ్చారు చిరంజీవి. ఇదిలా ఉంటే.. చిరంజీవి నటించిన తొలి చిత్రం ‘పునాది రాళ్ళు’. ఈ సినిమాకి గూడపాటి రాజ్‌కుమార్ దర్శకత్వం వహించారు. అయితే ఈ చిత్రం విడుదల ఆలస్యం కావడంతో చిరంజీవి నటించిన ‘ప్రాణం ఖరీదు’ సినిమా మొదట రిలీజ్ అయింది. ‘ప్రాణం ఖరీదు’ చిత్రం 1978 సెప్టెంబరు 22న విడుదల కాగా ‘పునాది రాళ్ళు’ 1979 జూన్ 21న రిలీజ్ అయింది. కాగా ప్రస్తుతం చిరంజీవి నటిస్తున్న చిత్రం ‘విశ్వంభర’. వశిష్ఠ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని వంశీ, ప్రమోద్, విక్కీ నిర్మిస్తున్నారు.


● రాజ్‌కుమార్ పెరియసామి, శివ కార్తికేయన్, సాయి పల్లవి, సుధాకర్ రెడ్డి, నాగ్ అశ్విన్

ఇలాంటి కథలు ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోతాయి

\- దర్శకుడు నాగ్ అశ్విన్

‘‘అమరన్’ అద్భుతమైన కథ. రియల్ స్టోరీ తీసినప్పుడు చాలా బాధ్యత ఉంటుంది. ఇలాంటి కథలు ప్రేక్షకుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి. కమల్‌హాసన్‌గారు ఈ సినిమాని నిర్మించడం గొప్ప విషయం. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలి’’ అని డైరెక్టర్ నాగ్ అశ్విన్ అన్నారు. శివ కార్తికేయన్, సాయి పల్లవి జంటగా నటించిన చిత్రం ‘అమరన్’. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో కమల్‌హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 31న తమిళ, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రాన్ని తెలుగులో శ్రేష్ఠ్ మూవీస్ పతాకంపై సుధాకర్ రెడ్డి, నిఖితా రెడ్డి రిలీజ్ చేస్తున్నారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో ముఖ్య అతిథిగా దర్శకుడు నాగ్ అశ్విన్ పాల్గొన్నారు. ఈ వేదికపై శివ కార్తికేయన్ మాట్లాడుతూ – ‘‘మేజర్ ముకుంద్ వరదరాజన్, ఇందు రెబెకా బయోపిక్‌గా రూపొందిన చిత్రం ‘అమరన్’. ఉద్యోగాన్ని ప్రేమించే కుటుంబం ఎలా ఉంటుందో డైరెక్టర్ రాజకుమార్ అద్భుతంగా చూపించారు. ఈ సినిమాలో నేను మేజర్ ముకుంద్ వరదరాజన్ పాత్ర చేశాను. ‘అమరన్’ లాంటి చిత్రాన్ని సపోర్ట్ చేస్తే ఇలాంటి రియల్ హీరో స్టోరీస్ ఇంకెన్నో వస్తాయి’’ అన్నారు. ‘‘అమరన్’ సినిమాతో మీ ముందుకు రావడం గర్వంగా ఉంది’’ అని సాయి పల్లవి తెలిపారు. ‘‘దేశవ్యాప్తంగా సెలబ్రేట్ చేసుకునే సినిమా ఇది. కమల్‌హాసన్‌గారి వల్లే ఈ ప్రాజెక్టు సాధ్యమైంది. ఈ సినిమాని ఇంత పెద్ద స్థాయిలో తెలుగులో రిలీజ్ చేస్తున్న సుధాకర్ రెడ్డి సార్‌కి కృతజ్ఞతలు’’ అన్నారు రాజ్‌కుమార్ పెరియసామి. ఈ వేడుకలో నిర్మాత ‘ఠాగూర్’ మధు, పాటల రచయిత రామజోగయ్య శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రేక్షకులు ఆశ్చర్యపోతారు

\- కిరణ్ అబ్బవరం


● నయన్ సారిక, కిరణ్ అబ్బవరం, తన్వీ రామ్

‘క’ కథ విన్నప్పుడు ఇలాంటి మంచి సినిమాను ప్రేక్షకులకు చూపించాలనిపించింది. ఈ సినిమా క్లైమాక్స్ చూసి ఆడియన్స్ ఆశ్చర్యపోతారు. ‘క’ సినిమాలోని ఏదైనా ఎలిమెంట్‌ను గతంలో స్క్రీన్‌పై చూశామని మీకు (ఆడియన్స్) అనిపిస్తే నేను సినిమాలు చేయడం మానేస్తా’’ అని కిరణ్ అబ్బవరం అన్నారు. సుజీత్–సందీప్ దర్శకత్వంలో కిరణ్ అబ్బవరం హీరోగా, నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటించిన పీరియాడికల్ మూవీ ‘క’. చింతా వరలక్ష్మి సమర్పణలో చింతా గోపాలకృష్ణా రెడ్డి నిర్మించారు. ఈ నెల 31న ఈ సినిమాను తెలుగులో వంశీ నందిపాటి రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం విలేకరుల సమావేశంలో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ – ‘క’లో పోస్ట్‌మ్యాన్ వాసుదేవ్‌గా కనిపిస్తాను. తోటి వారి జీవితంలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలని వాళ్ల ఉత్తరాలు చదువుతుంటాడు వాసుదేవ్. ఈ క్రమంలో అతని జీవితం ఎలా టర్న్ తీసుకుంది? అన్నది కథాంశం. వాసుదేవ్ పాత్రలో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయి. మా సినిమాను కన్నడ, మలయాళ, తమిళ భాషల్లో రిలీజ్ చేయాలనుకున్నాం... థియేటర్స్ దొరకలేదు. ప్రస్తుతం తెలుగులో రిలీజ్ చేస్తున్నాం. వారం తర్వాత మిగతా భాషల్లో రిలీజ్ చేసే ప్రయత్నం చేస్తాం’’ అన్నారు. ‘‘సినిమా ఆరంభం కాగానే ఆడియన్స్ ‘క’ ప్రపంచంలోకి వెళ్తారు’’ అన్నారు సందీప్. ‘‘క’కు ప్రేక్షకాదరణ లభిస్తుందనే నమ్మకం ఉంది’’ అని చెప్పారు వంశీ నందిపాటి.



రీతూ వర్మ మజాకా

హీరోయిన్ రీతూ వర్మ. సందీప్ కిషన్‌తో కలిసి మజాకా చేస్తున్నారు హీరోయిన్ రీతూ వర్మ. సందీప్ కిషన్, రీతూ వర్మ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం ‘మజాకా’. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్ పతాకాలపై రాజేష్ దండా నిర్మిస్తున్న చిత్రం ఇది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ వైజాగ్‌లో జరుగుతోంది. కాగా ‘మజాకా’ సినిమాలో రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తున్నట్లుగా వెల్లడించి, వైజాగ్ సెట్స్‌లో రీతూ వర్మ జాయిన్ అయినట్లుగా చిత్రయూనిట్ శనివారం అధికారికంగా వెల్లడించింది. ప్రస్తుతం పెళ్లి బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోందని తెలుస్తోంది. వచ్చే సంక్రాంతికి విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్.

అందమైన ప్రేమకథ


● విహాన్షి, షెరాజ్, నేహా దేశ్ పాండే, భాష్య శ్రీ

షెరాజ్ మెహదీ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం ‘ఓ అందాల రాక్షసి’. హీరోయిన్లు విహాన్షి హెగ్డే, కృతీ వర్మ, నేహా దేశ్ పాండే నటించారు. సుమన్, తమ్మారెడ్డి భరద్వాజ కీలక పాత్రలు పోషించారు. షేర్ సమర్పణలో స్కై ఈజ్ ది లిమిట్ బ్యానర్‌పై సురీందర్ కౌర్ నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో డైరెక్టర్, హీరో, మ్యూజిక్ డైరెక్టర్ షెరాజ్ మెహదీ మాట్లాడుతూ– ‘‘ఓ అందాల రాక్షసి’ గ్లామర్ బేస్డ్ మూవీ కాదు. మంచి కంటెంట్ ఉన్న అందమైన ప్రేమకథ. అమాయక మహిళలు కొందరి చేతిలో ఎలా మోసపోతున్నారు?. మోసం చేసేవారికి ఎలాంటి శిక్ష ఉంటుంది? అని ఈ మూవీలో చూపిస్తున్నాం’’ అని తెలిపారు. ‘‘ఓ అందాల రాక్షసి’ సినిమాకు కథ, మాటలు, పాటలు రాశాను’’ అని భాష్య శ్రీ చెప్పారు.

కేజీఎఫ్‌కు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది

\- దర్శకుడు సూరి



శ్రీ మురళి హీరోగా డా. సూరి దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘బఘీర’. ఇందులో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటించారు. హోంబలే ఫిలింస్ పతాకంపై విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31 విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రదర్శకుడు డా. సూరి మాట్లాడుతూ– ‘‘ప్రశాంత్ నీల్‌గారి ‘కేజీఎఫ్, సలార్’ చిత్రాల రైటింగ్ విభాగంలో నేనూ ఉన్నాను. శ్రీ మురళిగారితో నేను ఒక సినిమా చేద్దామనుకున్నప్పుడు కథ కుదర్లేదు. అప్పుడు తన దగ్గర కథ ఉందని ప్రశాంత్ నీల్‌గారు చెప్పడంతో ‘బఘీర’ చిత్రం ప్రారంభమైంది. సూపర్ హీరో అవ్వాలనుకున్న ఓ కుర్రాడి కథే ఈ చిత్రం. ఈ సినిమా అవుట్‌పుట్ చూసి ప్రశాంత్ నీల్‌గారు హ్యాపీ ఫీలయ్యారు. శ్రీ మురళి బాగా నటించారు. ‘బఘీర’ను ‘కేజీఎఫ్’తో పోల్చి మాట్లాడుతున్నారు. ‘బఘీర’ సినిమా ‘కేజీఎఫ్’ టోన్‌లో ఉండదు. ‘కేజీఎఫ్’ చరిత్రలాంటి సినిమా. ఈ సినిమాకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది’’ అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ‘‘పన్నెండేళ్ల క్రితం యశ్‌తో ఓ సినిమా చేశాను (‘లక్కీ’). ఆ తర్వాత యశ్‌తో ట్రావెల్ అయ్యాను. యశ్ కథలను నేనే వినేవాడిని. అయితే యశ్‌తో నేను అనుకున్న సినిమా వర్కౌట్ కాలేదు. ఆ తర్వాత ‘కేజీఎఫ్’ వల్ల యశ్‌కు చాలా సమయం పట్టింది. దీంతో నేను శ్రీ మురళితో ‘బఘీర’ చేశాను’’ అని తెలిపారు.

ఓటీటీ ఇది చూడొచ్చు

ఈ కలయిక కాస్త ఘాటు గురూ...

ఓటీటీలో ‘ఇది చూడొచ్చు’ అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం ‘ది యూనియన్’ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ఎక్కడైనా ప్రేమికులు చాలా ఏళ్ల తరువాత కలిస్తే, చాలా హాట్ హాట్‌గా ఉంటుంది. కానీ ఈ ‘ది యూనియన్’ సినిమాలో పాత ప్రేమికులు కలిసిన తరువాత ఇంత ఘాటా అని చూసే ప్రేక్షకుడు నోరెళ్లబెట్టాల్సిందే. అంతలా ఏముందీ సినిమాలో ఓసారి విశ్లేషించుకుందాం. జూలియన్ ఫరియానో దర్శకత్వం వహించిన స్పై కామెడీ థ్రిల్లర్ సినిమా ‘ది యూనియన్’. నెట్‌ఫ్లిక్స్ ఓటీటీలో తెలుగులోనూ ఈ సినిమాని చూడవచ్చు. హేమాహేమీలైన హాలీబెర్రీ, మార్క్ వాబర్గ్, మైక్ కాల్టర్ నటించిన ఈ సినిమా పెద్దలకు మాత్రమే. ఇక ఈ సినిమా కథాంశానికొస్తే... కథానాయకుడు మైక్ మెకన్నా న్యూజెర్సీ నగరంలో ఓ సాధారణ బిల్డింగ్ కార్మికుడు. రోజువారీ కష్టంతో తన పనేదో తాను చూసుకుపోయే మనస్తత్వం గలవాడు. కాకపోతే కాస్తంత అమ్మాయిల పట్ల పిచ్చి ఎక్కువ. హాయిగా సాగుతున్న మైక్ జీవితంలో అనుకోని ఓ అవాంతరం తన హైస్కూల్ క్రష్ అయిన రోక్సేన్ హాల్ ద్వారా ఎదురవుతుంది. 25 ఏళ్ల తరువాత కలిసిన తన ప్రేమను గుర్తు చేసుకుంటూ డాన్స్ చేస్తూ స్పృహ తప్పుతాడు మైక్. అలా న్యూజెర్సీలో స్పృహ తప్పిన మైక్ తిరిగి కళ్లు తెరిచేసరికి లండన్‌లో ఉంటాడు. మరోపక్క ఓ బ్రీఫ్‌కేస్ కోసం ఇరాన్ తీవ్రవాదులు, నార్త్ కొరియా ఏజెంట్లు, రష్యన్ గూఢచారులు తెగ వెతికేస్తుంటారు. ఆ బ్రీఫ్‌కేస్‌లో చాలా సెన్సిటివ్ ఇన్ఫర్మేషన్ ఉంటుంది. దాని కోసం యూనియన్ అనే సంస్థ తమ ప్రతినిధులను చాలా మందినే పోగొట్టుకుంటుంది. అసలు ఆ బ్రీఫ్‌కేస్‌కి, కథానాయకుడు మైక్‌కి సంబంధం ఏంటి? 25 ఏళ్ల తరువాత మైక్ ప్రియురాలు రోక్సేన్ హేల్ అతన్ని ఎందుకు కలిసింది? కలిసిన తరువాత అతను లండన్‌లో ఉండడం ఏంటి? అయినా ఓ ప్రేమికుల కలయికలో ఇంత ఘాటైన ట్విస్టులా? వీటి సమాధానాల కోసం ‘ది యూనియన్’ సినిమా చూడాల్సిందే. ఈ సినిమా ప్రేక్షకుడిని గిలిగింతలు పెట్టిస్తూ ఆద్యంతం థ్రిల్లింగ్ కలిగిస్తుందనడంలో సందేహం లేదు. వీకెండ్ మస్ట్ వాచ్ మూవీ ‘ది యూనియన్’.

\- ఇంటూరు హరికృష్ణ